# 1

# యరొబాము (1)

# ఉదయించి కాలిపోయిన నక్షత్రం

*మూల వాక్యము: 1 రాజులు 11:26-39; 12:1-14:20*

కొందరు జన్మతోనే నాయకులుగా పుట్టినట్టు కన్పిస్తారు. ఏ రకమైన కమిటీకైనా అప్పగించబడితే, లేదా ఏ గ్రూపులోనైనా వారిని పెట్టితే, దానికి నాయకులైపోతారు లేక దాన్ని నడిపిస్తారు – అలా చేయడానికి వారిని ఏరి తీసికొనకపోయినా సరే. జనంలోనుండి వారు పైకి లేచి "నాయకత్వాన్ని చేపడతారు." ఉదాహరణకు, అపొస్తలుల దళంలో, సీమోను పేతురు ముందుగా మాట్లాడేవాడు, జవాబిచ్చేవాడు, ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచే వాడు. అతడు కేవలం ఆలాటి మనుష్యుడు. "అతడు కార్యకారియైన మనుష్యుడు" అని మనం కొన్నిసార్లు అంటూ ఉంటాం. చెప్పేది లేక చేసేది తప్పే అయినా అతడేదో చెప్పబోతాడు, చేయబోతాడు. అతడు నడిపించాలి, అంతే.

యరొబాము ఈలాటి మనుష్యుడైయుండవచ్చు. ఇతరులను నడిపించడానికి ఒకనికి అవసరమైన లక్షణాలు అతనికున్నాయి. ఈ లక్షణాల్లో మూడింటిని మనం ఈ పాఠంలో చదువబోతున్నాం. అతనికి లోపించింది – ఒక్కటే, అయితే అదే ప్రధానమయ్యింది: *నీతి నిజాయితి.* ఎంత విషాదకరమైనది! జీవిత లక్షణాలలో (3-1=0) మూడులోనుండి ఒకటి తీసివేస్తే సున్న విషయాన్ని అతడు కనుగొన్నాడు. నీతి నిజాయితీ లేకుండ, అతడు ఏమి లేనివాడే. ఉదయించి త్వరలోనే కాలిపోయిన నక్షత్రంగా అతడున్నాడు.

అతని జీవిత గాధను తెలిపే మొదటి కొన్ని పుటలను (పేజీలను) దగ్గరగా చూడు. సరియైనది తప్ప తక్కిన ప్రతి లక్షణము కలిగియుండ ప్రయాసపడుటను గూర్చి అతడు మనలను హెచ్చరిస్తున్నాడు.

## ఆకాంక్షించే నమ్మిక

> ... సొలొమోను సేవకుడైన యరొబాము ... ఎఫ్రాయీమీయుడైన నెబాతు కుమారుడు, ఇతని తల్లి పేరు జెరూహా, ఆమె విధవరాలు (11:26).

యరొబాము యొక్క మొదటి పొగడదగిన లక్షణము నమ్మిక (అభయం). అతడు ఆకాంక్షించే, ముందుకు దూసికొనిపోయే, నమ్మకము గల ఎఫ్రాయీము గోత్రపు యువకుడు. అతని నమ్మిక (ధైర్యం) వంశ పారంపర్యంగా (సాలులో పాలుగా)ను

సహచర్యంగాను వచ్చియుండవచ్చు. ఎఫ్రాయిము అతిశయంగా ఉండే చారిత్రక గోత్రం. ఇశ్రాయేలులో మహా గొప్ప నాయకుడైన యెహోషువ వారి గోత్రంలోనుండి వచ్చినట్టు అతిశయింపవచ్చు. పైగా, ప్రత్యక్ష గుడారానికి తొలిగా ఏర్పాటు చేసిన షిలోహు అనే చోటు, వారి గోత్రపు భూభాగంలోనిదేనని వారు చెప్పుకోవచ్చు. వారికి దీర్ఘమైన, విరాజిల్లిన చరిత్ర ఉంది. మరియు తమకై వారు ఎదురు చూచేవి బహు ఉన్నతంగా ఉన్నాయి. వారికి కేటాయించబడిన భూభాగం చాలనిదని, వారి హోదాకును అది తగనిదని, వారి అవసరతలకు తక్కువైనదని వారు భావించారు. వారి గోత్ర భూభాగాన్ని యెహోషువా వారికి యిచ్చినప్పుడు, వారతని మందలించినట్టు మాట్లాడారు: "– మాకేల ఒక్క చీటితో ఒక్క వంతునే స్వాస్థ్యముగా ఇచ్చితివి? మేము ఒక గొప్ప జనమేగదా? ఇదివరకు యెహోవా మమ్మును దీవించెను ..." (యెహోషువ 17:14).

దాని మూలమేమైయున్నా, తమ కుటుంబ జీవితంలోని మహా వినాశనాన్ని తట్టుకొని యరోబాము నమ్మిక నిలిచియుంది. తన జీవితపు ఆరంభ కాలంలో, అతని తండ్రి, సొలొమోను పరివారములో ఒకడుగా ఉండి చనిపోయాడు. చిన్న వయస్సులో తండ్రి చనిపోవడం ఒక చిన్నవానికి భూమి కంపించినలాటి అనుభవమై యుండవచ్చు, దిగ్భ్రమ మరియు అనిశ్చయత అనే దీర్ఘమైన మచ్చలు చెరగనివిగా నిలిచిపోయి ఉండవచ్చు. మనం చెప్పగలిగినంతమట్టుకు, యిది యరోబాము యొక్క పరిస్థితి కాదు. తండ్రిని కోల్పోవడం అతని ఉత్సాహాన్ని పాడుచేయలేదు. లేఖనంలో మనమతని తొలిగా చూచినప్పుడు, దృఢంగాను, ధైర్యంగాను, బిడియం లేనివాడుగాను కన్పిస్తాడు.

నమ్మికయనేది అవసరమైన గుణలక్షణం. గర్వంగా మారకపోతే అది ప్రయోజనకరమైనదే. నమ్మిక కలిగిన ప్రజ్ఞగల మనిషిని మెచ్చుకోవాలి. ప్రజ్ఞగలవాడు గర్విష్టియైతే ప్రతివానిచేత అసహ్యించుకోబడతాడు. ప్రయత్నించేవారికి నమ్మిక ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. గర్వము లేక అహంకారపు దృష్టి ఒకని అవమానకరంగా కూలద్రోస్తుంది.

## మెచ్చదగిన తలాంతు

> అయితే యరోబాము అను ఇతడు మహా బలాఢ్యుడైయుండగా యౌవనుడగు ఇతడు పనియందు శ్రద్ధగలవాడని సొలొమోను తెలిసికొని, యోసేపు సంతతివారు చేయవలసిన భారమైన పనిమీద అతనిని అధికారిగా నిర్ణయించెను (11:28).

యరోబాము యొక్క కోరదగిన మరియొక లక్షణము తలాంతు (టేలెంట్). అతడు కష్టించి పనిచేసేవాడు మాత్రమే కాదు, అతడు ప్రత్యేకమైన పనివాడు, నైపుణ్యంగల పనివాడు. అతని పనియందలి శ్రద్ధ, అతని పని అలవాట్లువలన పేరు ప్రఖ్యాతులు తనపై అధికారులవరకు మాత్రమే గాక, రాజునొద్దకును అవి చేరాయి. పని స్థలంలో అతని ఆధిక్యతనుబట్టి, సొలొమోను క్రింద అధికారిగా ఉండే స్థానం అతనికియ్యబడింది. యోసేపు యింటివారు చేయవలసిన భారమైన పనివారిమీద అతడు అధికారిగా చేయబడ్డాడు.

ప్రతిభ మెచ్చుకోదగినదై కూడా ఉంటుంది. అది లేకుండ నడిపించేవానిమీద జాలిపడాలి. ప్రతిభలో తనదైన శీలం ఉండదని గుర్తుపెట్టుకోవాలి. అది డబ్బువంటిది. అది ఎవరి చేతిలో ఉంటుందో దానికి వీరి శీలం అబ్బుతుంది. నీతి హృదయంచేత నడిపింపబడినప్పుడే సామర్థ్యానికి (టేలెంట్‌కు) విలువ వస్తుంది.

## ఆకర్షణీయమైన స్వరూప సౌందర్యం

> యరోబాము తిరిగి వచ్చెనని ఇశ్రాయేలు వారందరు విని, సమాజముగా కూడి, అతని పిలువనంపించి ఇశ్రాయేలు వారందరి మీద రాజుగా అతనికి పట్టాభిషేకము చేసిరి (12:20).

యరోబాముకున్న మూడవ గుణలక్షణం “ఆకర్షణీయమైన వ్యక్తిత్వం” లేక “చారిస్మ” అని పిలువబడేదైయుంది. అతడు ప్రజలు వెంబడింపగోరే మనిషైయున్నాడు. అతడు మాట్లాడి నప్పుడు ప్రజలు ఆలకిస్తారు. ప్రజలు అతనియందు నమ్మికయుంచారు. వారికి రాజు కావలసి వచ్చినప్పుడు, అతడు వారి మొదటి చాయిస్ (తొలిగా కోరబడేవాడు).

ఆకర్షణీయమైన వ్యక్తిత్వం నిశ్చయముగా దీవెనయైయుంది. చెదరగొట్టే స్వభావాన్ని బట్టి పని పతనమవ్వడం ఎవడే కోరుకోడు. దాని న్యాయసమ్మతి స్థితిని వారు చూడలేనందున జనులు ఒక పనిని (ప్రయాసను) నిరాకరింపవచ్చు. సరే. అది సరిపోయిన కారణమే. డబ్బు లేకపోయినా బలం లేకపోయినా జనులు ఒక పనిని కొనసాగింప నిరాకరించవచ్చు. అది కూడా సరిపోయిన కారణమే. అయితే ఆ పనిని ప్రతిపాదించిన వ్యక్తి వారు యిష్టపడనందున ఆ మంచి కార్యమును వారు నిరాకరించినట్టయితే, అది విపత్కరమైనదైయుంటుంది. అది ఆ ప్రయాసను వ్యర్థం చేస్తుంది ఆ పని యొక్క సత్యాన్ని గూర్చి కాదు అది ఏ కాగితంతో చుట్టబడి తేబడిందో దాన్నిబట్టి అలా జరిగింది.

మనోహరమైన వ్యక్తిత్వము సత్యము వినబడేలా చేయగలదు. లేదు, వ్యక్తిత్వమును బట్టి మాత్రమే జనులు ప్రేరేపించబడడం మంచిది కాదు; మనోహరమైన వ్యక్తి ద్వారా సత్యము చెప్పబడాలని మనం కోరుకుంటాం. ఆ సత్యం అంగీకరించబడాలని కూడా కోరుకుంటాం, అది ఎవరు చెప్పారు అనేదాన్నిబట్టి కాదు. తక్కిన సంగతులన్నియు సమానంగా ఉండగా, ఏదియెలాగున్నా, మంచి వ్యక్తిత్వము సత్యం చెప్పడానికి సహాయ పడుతుంది.

మనమందరం అభినందించే కొన్ని లక్షణాలు యరోబాముకున్నాయి: నమ్మిక, టేలెంట్ (నైపుణ్యం), మనోహరమైన వ్యక్తిత్వముంది. “నడిపించడానికి కావలసిందంతా అదే” అని మనమంటాం. అవునా? తనకు కలిగియున్నదానితో యరోబాము ఏమి చేశాడో చూద్దాం.

ఒక రోజున, యరోబాము యెరూషలేమునకు వెళ్లుచుండగా, అతనిని ప్రవక్తయైన అహీయా కలిసికొంటాడు. అతడు ధరించుకొనియున్న క్రొత్త పైవస్త్రమును తీసికొని, ఏమి జరుగబోతుందో దానికి ప్రవచనంగా అహీయా 12 ముక్కలుగా చింపాడు. అతడు యరోబాముతో యిట్లన్నాడు:

> – ఈ పది తునకలను నీవు తీసికొనుము;[1] ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా ... "సొలొమోను చేతిలోనుండి రాజ్యమును కొట్టివేసి పది గోత్రములను నీకిచ్చెదను" (11:30బి–33).

దావీదునుబట్టి రెండు గోత్రాలు ఉంచబడతాయి (11:32), అయితే వారి విగ్రహారాధనను బట్టి ఇశ్రాయేలుపై తీర్పుగా ఈ విభజనను దేవుడు జరుగనిచ్చాడు: ఊరకనే ఏదీ జరుగదు. దేవుడు అలా జరిగేలా దానికి అనుమతియైనా యివ్వాలి లేదా అలా జరిగేలా చూస్తాడు. అంతేగాని కేవలం దానంతటికి అదే జరుగదు. ఈ సందర్భంలో, విభజన జరగడానికి దేవుడు అనుమతినిచ్చాడు.

దేశాన్ని నడిపించే అవకాశాన్ని యరోబాము పొందనున్నాడు. అతడు ఎల్లవేళలా కోరుకున్నది సింహాసనమే అయ్యుండవచ్చు. సూర్యుని క్రింద అతని దినం వచ్చింది. దేవుడు అతనికి మహా ఘనమైన స్థితిని యివ్వనున్నాడు. దానితో అతడేమి చేయబోతాడు?

అహీయా యరోబాముతో చెప్పినది సొలొమోను చెవ్వికి వినబడియుండవచ్చు. ఎందుకంటే, అతడు వెంటనే యరోబామును చంపజూచాడు. ఎలాగో సొలొమోను చేతిలో పడకుండ యరోబాము ఐగుప్తుకు పారిపోయి రాజైన షీషకును ఆశ్రయించాడు. సొలొమోను మరణించేవరకు అతడు ఐగుప్తు కాపుదలలోనే నిలిచిపోయాడు.

సొలొమోను మరణించగా, ప్రజలు షెకెములో కూడి, తరువాతి రాజుగా సొలొమోను కుమారుడైన రెహబామునకు పట్టాభిషేకము చేయవచ్చారు. యరోబాము సొలొమోను మరణవార్త విని, ఐగుప్తునుండి తిరిగి వచ్చి, తమ భారములను తేలికగా చేయుమని అడగడానికి ఇశ్రాయేలీయులతో పాటు యరోబాము కూడ వారి నూతన రాజును వేడుకొనడానికి వెళ్లాడు. వారికి జవాబు యివ్వడానికిగాను రెహబాము మూడు దినాల కాల వ్యవధిని కోరాడు. ఆ మూడు దినాల్లో, తానేమి చేయాలో ఇశ్రాయేలు పెద్దలను సంప్రదించాడు. "అలా చేయి. వారి భారములను తేలికగా చేయి" అని వారు బదులిచ్చారు. అదే విషయం అతడు తన సాటి యువకులతో సంప్రదించాడు. "– నా తండ్రి నడుముకంటె నా చిటికెన వ్రేలు పెద్దదిగా ఉండును. నా తండ్రి మీమీద బరువైన కాడిని పెట్టెను సరే, నేను ఆ కాడిని ఇంక బరువుగా చేయుదును; నా తండ్రి చబుకులతో మిమ్మును శిక్షించెను సరే, నేను కొరడాలతో మిమ్మును శిక్షించుదును" అని చెప్పి వారు సలహా యిచ్చారు (12:10బి–11). బుద్ధిహీనంగా రెహబాము యువకుల సలహాను పాటించాడు. అతడు తన నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత, అహీయాచే ప్రవచింపబడి నట్టే, విభజన తటస్థించింది. పదకొండు గోత్రాలు యరోబాముతో వెళ్లాయి. యూదా గోత్రం రెహబాముతో ఉండిపోయింది.

రెహబాము యొక్క వెట్టి పనులమీద అధికారియైన అదోరాము, యితర గోత్రముల యొద్దకు వెళ్లి పరిస్థితిని బలపరచ ప్రయత్నించగా ఇశ్రాయేలీయులందరు అతని రాళ్లతో కొట్టినందున అతడు చనిపోయాడు. రెహబాము యెరూషలేమునకు పారిపోయాడు. అక్కడ అతడు యూదావారిని బెన్యామీనీయులను[2] యుద్ధానికి పోగుచేశాడు. యూదా బెన్యామీను గోత్రములనుండి అతడు 1,80,000 మంది యోధులను సమకూర్చాడు. ఉత్తరాది గోత్రములవారిని మాట్లాడి వశపరచుకొనలేకపోతే, కొట్టి వారిని లోబరచు

కోవాలని అతడు సమకట్టాడు. అతడు వారికి ఆజ్ఞాపించలేకపోతే, వారిని బలవంతపెట్ట పూనాడు. మాటలు పని చేయకపోతే, కొందరు కత్తులు దూయడానికి తీర్మానించు కుంటారు.

రెహబాముకు సందేశమివ్వడానికి దేవుడు షెమయా అనే తన ప్రవక్తను పంపుతాడు. "ఈ కార్యము నావలన జరుగుచున్నదని యెహోవా సెలవిచ్చుచున్నాడు గనుక, బయలుదేరకుండను మీ సహోదరులతో యుద్ధము చేయకుండను మీరందరును మీ మీ యిండ్లకు తిరిగి పోవుడి" అని ఆ ప్రవక్త చెప్పాడు (2 దినవృత్తాంతములు 11:4). తన ఉద్దేశాలను నెరవేర్చుకొనడానికి దేవుడు ఈ విభజనను వినియోగించుకొన్నాడు. విభజన దేవుని చిత్తమని షెమయా మాటలకు అర్థం కాదు. ఈ విభజన పాపంవలన కలిగింది. అయితే తన ప్రవక్తయైన అహీయా ద్వారా పలికిన మాటలను దేవుడు నెరవేర్చుతున్నాడు (2 దినవృత్తాంతములు 10:15). రెహబాము షెమయా మాట నాలకించి తన సైన్యాలను యింటికి పంపించాడు.

విభజన స్థిరమయ్యింది. ఇక్కడనుండి ఇశ్రాయేలుకు యిద్దరు రాజులు, రెండు రాజ్యాలు ఉంటాయి. పదకొండు గోత్రములవారు క్రొత్త రాజును తమ క్రొత్త రాజ్యంకొరకు ఏర్పరచుకొన కూడివచ్చారు. యరోబామును వారు ఏకగ్రీవంగా కోరుకున్నారు.

> మరియు యరోబాము తిరిగి వచ్చెనని ఇశ్రాయేలువారందరు విని, సమాజముగా కూడి, అతని పిలువనంపించి ఇశ్రాయేలువారందరి మీద రాజుగా అతనికి పట్టాభిషేకము చేసిరి; యూదా గోత్రీయులు తప్ప దావీదు సంతతివారిని వెంబడించిన వారెవరును లేకపోయిరి (12:20).

యరోబాము యిప్పుడు ఒక కోరదగిన నాయకత్వపు స్థానంలో నిలిచాడు. యరోబాము ఎలాటి రాజు అయ్యుండబోతాడు? ఈ నాయకునినుండి మనం ఏమి నేర్చుకోగలం? యరోబాముకు ప్రజ్ఞ ఉంది, నడిపించగల విశేష లక్షణముంది, నమ్మికయుంది. కాని – *నిజాయితి* అనే తప్పనిసరియైన లక్షణం అతనిలో లోపించినట్టు మనం చూడబోతాం.

షెకెములో ఇశ్రాయేలీయుల యిష్టం మేరకు ప్రారంభోత్సవం జరిగిన మీదట (12:20), అతడు షెకెమును పెనూయేలును తనకు రెండు రాజధాని నగరులుగా బలపరచుకున్నాడు – అందులో ఒకటి యొర్దానుకు పశ్చిమంగాను, మరొకటి తూర్పుగాను ఉంటాయి (12:25). తిర్సా అనే ఒక నగరులో తన నివాసాన్ని ఏర్పరచుకున్నాడు (14:17). దేవుని ధర్మశాస్త్రానికి అతడు లోబడియుంటే, అతని రాజ్యము అతని రాజ వంశం స్థిరపరచబడుతుందని అతడు అభయమియ్యబడ్డాడు. తాను ఏమి చేయాలని దేవుడు కోరుకున్నాడో ఆ సంగతిని అహీయాచే అతడు చెప్పబడ్డాడు:

> నేను నీకు ఆజ్ఞాపించినదంతయు నీవు విని, నా మార్గముల ననుసరించి నడుచుచు, నా దృష్టికి అనుకూలమైనదానిని జరిగించుచు నా సేవకుడైన దావీదు చేసినట్లు నా

> కట్టడలను నా ఆజ్ఞలను గైకొనినయెడల, నేను నీకు తోడుగా ఉండి దావీదు కుటుంబమును శాశ్వతముగా నేను స్థిరపరచినట్లు నిన్నును స్థిరపరచి ఇశ్రాయేలువారిని నీకు అప్పగించెదను (11:38).

యరోబాము ఏమి చేశాడు? దేవుని ప్రవక్త మాట అతడు విన్నాడా? లేదు. వెంటనే అతడు ఇశ్రాయేలును పాపంలోనికి నడిపించాడు. దైవ అంగీకారమైన నాయకుడుగా ఉండడానికి అవసరమయ్యింది ఒక్కటి తప్ప సమస్తము తనకున్నట్టు త్వరలోనే అతడు ప్రత్యక్షపరచాడు – దేవుని ఆజ్ఞలను అనుసరించేలా తన్ను వెంబడించేవారికి బుద్ధిని పుట్టించే హృదయం అతనికి అవసరం.

## ముగింపు

"ఇశ్రాయేలు పాపము చేయించుటకు కారకుడు" అని యరోబామును గూర్చి పాత నిబంధనలో ఏదో యొక రూపంలో ఇరువది ఐదు సార్లు ఉంది. W. Graham Scroggie యిలా రాశాడు:

> ఒకని గూర్చి చెప్పదగిన బహు హీనమైన సంగతి అతడు మానక పాపం చేస్తూ, యితరులు పాపం చేసేలా చేస్తున్నాడు అనేదే. అట్టిది "నెబాతు కుమారుడైన యరోబామును" గూర్చి ఇరువది ఐదు సార్లు చెప్పబడింది. ఏ నరునికి అంతటి విశేషమైన అవకాశం అనుగ్రహింపబడలేదు, ఎవడును దాన్ని అంత దుష్టత్వంగా త్రోసివేయలేదు. దేవుడు తనకు ఆజ్ఞాపించిన దానినంతటిని ఆలకించి, ఆయన మార్గములలో నడుస్తూ, ఆయన దృష్టికి అనుకూలమైన దాన్ని జరిగించినట్టయితే, ఆయన ఆజ్ఞలను కట్టడలను విధులను గైకొనినట్టయితే, దేవుడు అతనితో ఉంటాడు, ఆయన దావీదుకు చేసినట్టే, ఇశ్రాయేలులో అతనికిని నిశ్చయముగా యింటిని కట్టేవాడే (1 రాజులు 11:38). అంతకంటె ఒకడు యింకా ఏమి కోరుకోగలడు? తన పాపము మానక యుండుటవలనను, ఇశ్రాయేలుచే పాపం చేయించడంవలనను యరోబాము బహిరంగంగాను విడువకను దాన్ని త్రోసిపుచ్చాడు.[3]

"ఇశ్రాయేలును నేను ఎక్కడికి నడిపిస్తున్నాను?" అనే ప్రశ్న యరోబాము తననే అడుగుకొనియుండినట్టయితే, "ఈ జనాంగాన్ని నేను బహు హీనమైన నాశనానికి, ఆత్మ సంబంధమైన నాశనానికి నడిపిస్తున్నాను" అనే జవాబు వచ్చియుండేదే. నమ్మిక, ప్రజ్ఞ, యితరులను కైవశం చేసికోగల సామర్థ్యం – స్వార్థపరమైన, పాపేచ్ఛలననుసరించడం అనేవాటి మీద వ్యర్థం చేసికొన్నట్టయితే, దీర్ఘకాలంలో దేనికి పనికి రాకుండపోతాయి – సరిగదా, దీవించే దానికన్న అవి నాశనం చేస్తాయి.

**నేర్చుకొనవలసిన పాఠం:**
**రాజ నగరులో జీవించడం కంటెను**
**వినయమైన నీతిగల హృదయాన్ని**
**కలిగి యుండడం శ్రేష్ఠం.**

## సూచనలు

[1]దక్షిణ రాజ్యము రెండు గోత్రాలతో కూడినదైయుంది అనడానికి యిది మొదటి సూచన. వాస్తవమైన చీలికయొద్ద, పదకొండు గోత్రాలు విడదీసికొనిపోయినట్టు కన్పిస్తాయి. అయితే తరువాత బెన్యామీను తిరిగి వచ్చి యూదాతో నిలిచియుంది. [2]బెన్యామీను తిరిగివచ్చి యూదాతో నిలిచినట్టుంది. చీలిన తదుపరి యరోబాముతో వెళ్లడాన్ని గూర్చి రెండో తలంపున్నట్టు ఉంది. తిరిగి యూదాతో సమాధానపడినట్టుంది. [3]W. Graham Scroggie, *The Unfolding Drama of Redemption* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1976), 299.